క్లుప్తంగా

భాషా వలంటీర్లకు పుస్తకాలు అందజేత



పుస్తకాలు అందిస్తున్న ఎంఈవో చంద్రశేఖర్

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఏటీడబ్ల్యూవో కార్యాలయంలోని గొడౌన్ వద్ద సవర భాషా వలంటీర్లకు పీపీ-1, 2, 3 పుస్తకాలను శనివారం అందజేశారు. ఆయా పుస్తకాలను సవర భాష మాట్లాడే విద్యార్థులకు పంపిణీ చేయాలని ఎంఈవో బి.చంద్రశేఖర్, గుమ్మలక్ష్మీపురం ఏటీడబ్ల్యూవో బి.సురేష్‌కుమార్‌లకు సూచించారు. సదరు విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే మెరుగైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

100 సారా ప్యాకెట్ల స్వాధీనం



పట్టుబడిన సారా ప్యాకెట్లు చూపిస్తున్న సీఐ సురేష్

కొమరాడ: మండలంలోని విక్రంపురం గ్రామ సమీపంలో రాజ్యలక్ష్మీపురానికి చెందిన ఓ వ్యక్తి సారాతో పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ సురేష్ శనివారం తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి, అతడి నుంచి 100 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తయారీ, అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

ఆలయాలు కిటకిట



దైవదర్శనానికి క్యూలైన్‌లో ఉన్న భక్తులు

గరుగుబిల్లి: పవిత్ర కార్తీకమాసం పురస్కరించుకుని, మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి, కోదండరామస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. ఓ వైపు మాలాధరణ చేసిన అయ్య ప్ప, శివస్వాములు, మరోవైపు సాధారణ భక్తు లు భగవంతుడి దర్శనానికి పోటీపడ్డారు. గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండి, దేవుడిని మనసారా దర్శించుకుని, పూజలు చేశారు.


వరిలో రెల్లురాల్చు పురుగుతో పంటకు నష్టం

వీరఘట్టం: వరి పంటలో గింజ గట్టిపడే దశలో రెల్లురాల్చు పురుగు, గొంగళి పురుగు పంటకు నష్టాన్ని కలిగిస్తాయని మండల వ్యవసాయ శాఖాధికారి జక్కువ సౌజన్య అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటను పరిశీలించగా రెల్లురాల్చు పురుగు ఆశించినట్లు గుర్తించారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. రాత్రిపూట ఈ పురుగుల ఉద్ధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. వీటి నియంత్రణకు పొలానికి ముందుగా నీరు పెట్టి ఈ పురుగులను తొలగించాలని సూచించారు. తర్వాత 2.5 ఎం.ఎల్ క్లోరోఫైరిపాస్ మందును ఒక లీటరు నీటిలో కలిపి ఒక ఎకరా పొలంలో పిచికారీ చేయడం ద్వారా ఈ పురుగులు పంటకు ఆశించకుండా నియంత్రించవచ్చని సూచించారు. అలాగే వరిలో గింజ గట్టిపడే దశలో 400 ఎం.ఎల్ పర్మెత్రిన్ మందును పావు లీటరు నీటిలో కలిపి ఒక ఎకరా వరి పంటలో పిచికారీ చేసి 99 శాతం ఈ పురుగులు రాకుండా నియంత్రించవచ్చన్నారు. గింజ ఇంకా పచ్చిగా ఉన్నప్పుడు 500 ఎం.ఎల్ బైఫిత్రిన్ మందును 400 ఎం.ఎల్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల రెల్లురాల్చు పురుగుతో పాటు ఆకు ముడత పురుగులను కూడా నియంత్రించవచ్చన్నారు.

పత్తి పంట నమోదు

భామిని: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లింపునకు అనువుగా పత్తి సాగు రైతుల వివరాలు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకొని ఈకేవైసీ చేయించుకోవాలని నేరడి-బి వ్యవసాయ సహాయకుడు పి.ఈశ్వర్ శనివారం తెలిపారు. సాలూరులోని పత్తి కొనుగోలు కేంద్రంలో పత్తి అమ్మకం చేయాలంటే ఈ-పంట నమోదుతో పాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. అప్పుడే పత్తి పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర వస్తుందన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించండి



కీసరలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఏఈ

భామిని: ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల నిర్మాణాలు నిలిపివేసిన లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని హౌసింగ్ ఏఈఈ చంద్రశేఖరనాయుడు అన్నారు. మండలంలోని కీసర, కొసలి, ఘనసర, ఏటంగూడ, మణిగ, బొడ్డగూడ గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. పీఎంఏవై, కాలనీ గృహాలను జీపీఎస్‌లో నమోదు చేయాలన్నారు.

బొప్పాయిలో సస్యరక్షణే కీలకం

- మేలు రకం విత్తనాల ఎంపిక ముఖ్యం
- చీడపీడల నివారణపై దృష్టి సారించాలి
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే రెండేళ్ల వరకు దిగుబడి
- మార్కెట్లో మంచి డిమాండ్

సీతంపేట:



ఎస్.లక్ష్మినారాయణ, శాస్త్రవేత్త

బొప్పాయి సాగుకు సమయానుకూల నీటి తడులే ప్రధానం. ఒకసారి నాటిన బొప్పాయి తోటలు రెండేళ్ల వరకు దిగుబడినిస్తాయి. వాణిజ్య పరంగా మార్కెట్లో బొప్పాయి పండ్లకు మంచి డిమండ్ ఉంది. సరైన సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే బొప్పాయి సాగులో మంచి దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఎస్.లక్ష్మీనారాయణ సూచిస్తున్నారు.

నీరు నిలవని నేలలే అనుకూలం

నీరు నిలిచే నేలలు, అధిక చౌడు నేలలు, ఆమ్ల భూములు బొప్పాయి సాగుకు పనికిరావు. నీరు నిలవని సారవంతమైన ఎర్రగలప నేలలు, తేలిక పాటి నల్లరేగడి భూములు పంటసాగుకు అనుకూలంగా ఉంటాయి.

విత్తన రకాలు

బొప్పాయిలో ఆడ పుష్పాలు, ద్విలింగ పుష్పాలు కలిగిన మొక్కలను ఎంచుకోవాలి. వాటిలో సూర్య, రెడ్ లేడీ, సన్‌రైజ్, సోలో, పూసా, డెలీషియస్, వాషింగ్‌టన్, కో-1,2,3,4,5,6,7 వంటి రకాలు ఉన్నాయి.

విత్తే పద్ధతి

పండు నుంచి తీసిన విత్తనాలను మొదట ఆరబెట్టుకోవాలి. వాటిని జాగ్రత్తపరిచి 45 రోజుల్లో నాటాలి.



బొప్పాయి పంట

హైబ్రిడ్ బొప్పాయి నుంచి తీసిన విత్తనాలను వాడరాదు. ఎకరానికి డెలీషియస్ రకాలకు 200 గ్రాములు, సన్‌రైజ్, సోలోలోని రకమైన గ్లెనో డెలిషియన్ రకాలకు 20 గ్రాముల విత్తనాలు సరిపోతాయి. పశువుల ఎరువు, ఇసుక కలిపిన మట్టిని పాలిథిన్ సంచుల్లో నింపుకొని విత్తనాలు విత్తుకోవాలి. అనంతరం నీటి తడిని అందించాలి.

నాటుకునే విధానం

బొప్పాయి తోటలకు చీడపీడల బెడద ఎక్కువగానే ఉంటుంది. భూమి ద్వారా వ్యాపించే చీడపీడల నివారణకు 30-4 సెం.మీ లోతుగా భూమిని కలియదున్నాలి. గొర్రుతో నాలుగు సార్లు మెత్తగా దున్నాలి. మొక్కల మధ్య 1.8 మీటర్ల ఎడం ఉండేటట్లు గుంతలు తీసుకోవాలి. ఒక్కో గుంతలో ఐదు కిలోల పశువుల ఎరువు, కిలో వేపపిండి, 20 గ్రాముల పాస్పా బ్యాక్టీరియా వేసి బాగా కలిపి గుంతలను నింపుకోవాలి. మొక్కలను సాయంత్రం పూట నాటుకోవాలి. తోటల్లో సస్యరక్షణ చాలా ముఖ్యం. పంటను ఆశించే తెగుళ్లపై రైతులకు అవగాహన కలిగి ఉండాలి.

కాండం కుళ్లు తెగులు

కాండం కుళ్లు తెగులుతో చెట్లు తీవ్రంగా దెబ్బతింటాయి. వేర్లతో పాటు కాండం మెత్తగా మారి కుళ్లిపోతాయి. ఇది ఎక్కువగా నర్సరీల్లో అధిక నష్టాన్ని కలుగజేస్తుంది. కాయలు ఉన్న చెట్లలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. మొదలు కుళ్లు నివారణకు మొదట మొదలు వద్ద నీళ్లు నిలవకుండా చూసుకోవాలి. కాండం చుట్టూ ఉన్న నేలను ఒక శాతం బోర్డో మిశ్రమం మందుతో తడపాలి.

పరిశుభ్రతే కీలకం..

బొప్పాయి తోటలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. చెట్ల కింద, పైన మిగిలిపోయిన పండ్లను ఏరి నాశనం చేయాలి. ఆకర్షించే మగ పురుగులను నాశనం చేయడానికి మిథైల్ యాజినాల్‌ను, 2 ఎంఎల్ కార్బోఫ్యూరాన్ ఒక లీటరు నీటిని కలిపిన మందు ద్రావణాన్ని ఐదు సమభాగాలుగా చేసి ఒక్కో ప్లాస్టిక్ పళ్లెంలో 200 ఎంఎల్ మందు ద్రావణాన్ని పోసి పొలంలో అక్కడక్కడా పెట్టాలి.

బూడిద రంగు శిలీంద్రం

కాండంపైన కొత్తగా చిగుళ్లు వేసిన ఆకులపై తెల్లటి బూడిద రంగు కలిగిన శిలీంద్రపు పెరుగుదల కనిపిస్తుంది. దీని నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాముల లేదా ఒక మిల్లీ లీటరు కెరాథీన్ లేదా హెక్సాకొనజోల్ 2 ఎంఎల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

ఆకు ముడత తెగులు

మొక్కల్లో ఆకులు ముడుచుకుపోతాయి. ఆకులు ఉండలుగా మారి వికృత రూపాన్ని దాల్చుతాయి. కాయల ఆకారం సైతం గజిబిజిగా తయారవుతాయి. దీంతో కాయల దిగుబడి చాలా వరకు తగ్గిపోతుంది. ఈ వైరస్ తెగులుతో రసం పీల్చే తెల్ల దోమలు, పేను బంక వ్యాపిస్తుంది. అంతర్వాహిక కీటక నాశనులతో ఈ వైరస్‌ను అరికటవచ్చు.

పండు ఈగల బెడద

బొప్పాయి కాయలు పక్వానికి వచ్చే దశలో పండు ఈగలు కాయలను ఆశ్రయించి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తాయి. తల్లి ఈగ సూదిలాంటి మొనను కాయల చర్మం కిందకి చొప్పించి గుడ్లను గుంపులు, గుంపులుగా విడుదల చేస్తుంది. ఈ గుడ్లు నాలుగు రోజుల్లో పొదిగి లార్వాలను వృద్ధి చేస్తాయి. ఇవి కాయలోని గుజ్జును తినేయడంతో కాయలు మెత్తబడి కుళ్లి పోతాయి.

కోతలు..

మంచి సైజుకు వచ్చిన బొప్పాయి కాయలు మాగక ముందే చెట్టుపై నుంచి కోసుకోవాలి. కోసిన కాయలు న్యూస్‌పేపర్లో చుట్టి రవాణా చేసుకుంటే తాజాగా ఉంటాయి. మొక్కలు నాటిన 9వ నెల నుంచి దిగుబడి చేతికొస్తుంది. ఇలా రెండున్నరేళ్ల పాటు పంట దిగుబడి వస్తుంది. ఎకరానికి 25 నుంచి 30 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. వాణిజ్య పరంగా సరైన నీటి వసతి కలిగి ఉండి, స్వల్ప పెట్టుబడితో సాగుపై దృష్టి సారిస్తే బొప్పాయి రైతులను లక్షాధికారులను చేస్తుంది.

మునగ మొక్కల పంపిణీ



మునగ మొక్కలు అందిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పాలకొండ రూరల్: ఐసీడీఎస్ నేతృత్వంలో అంగన్‌వాడీలకు మునగ మొక్కలను సీడీపీఓ సిమ్మాలమ్మ శనివారం అందించారు. మండలంలోని తుమరాడ నర్సరీ ద్వారా సమకూర్చిన రెండు వందల మొక్కలను పాలకొండ, వీరఘట్టం మండలాల పరిధిలో అంగన్‌వాడీలకు అందించారు. ఈ మొక్కల పెంపకంతో సమకూరే ఫలసాయం, ఆకులను కేంద్రాలకు వచ్చే పిల్లలకు అందించటం ద్వారా వారిలో రోగ నిరోధక శక్తిని పెంపొందించవచ్చని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి.శోభారాణి, ఉపాధి ఏపీఓ ఎం.ఈశ్వరమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దశారత్నం, మేరి,తదితరులున్నారు.

ఓటుహక్కు నమోదు చేసుకోవాలి



ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పాలకొండ మండల పరిధిలో ఉన్నత పాఠశాలల్లో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న టీచర్లు ఓటు హక్కు నమోదుకు అర్హులని తహసిల్దార్ బాలమురళికృష్ణ అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఓటరు జాబితాలను ప్రదర్శించారు. సదరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉన్న, అర్హత ఉండి పేర్లు నమోదు కాకున్నా పూర్తి సమాచారం, ఆధారాలతో ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సత్యసాయి బోధనలు అనుసరణీయం

వాడవాడలా భగవాన్ సత్యసాయిబాబా జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున పుణ్యస్నానాలు ఆచరించి, మందిరాలకు చేరుకున్న భక్తులు ప్రత్యేక భజనలు, పూజలు చేశారు. బాబా పేరిట మధ్యాహ్నం అన్నదానం, వస్త్రదానం, వైద్యసేవలు వంటి సేవా కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం బాబా చిత్రపటాన్ని వీధుల్లో ఊరేగిస్తూ చేసిన నగర సంకీర్తనతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. సత్యసాయి బోధనలు అనుసరణీయమని, ఆయన బాటలోనే నడవాలని, ఆదర్శవంతమైన సమాజానికి పాటుపడాలని వక్తలు కోరారు.

–పాలకొండ, కురుపాం నెట్‌వర్క్



జియ్యమ్మవలస: చినమేరంగిలో జరిగిన కార్యక్రమంలో సత్యసాయి గొప్పతనం వివరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు



భామిని: సొలికిరిలో కళశాలతో ఊరేగుతున్న సత్యసాయి భక్తులు



సీతంపేట: చీరలు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు



వీరఘట్టం సత్యసాయి మందిరం వద్ద అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

యాజమాన్య పద్ధతులపై శిక్షణ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల రైతు భరోసా కేంద్రాల వ్యవసాయ సహాయకులకు జీడి, అరటి, పామాయిల్ తోటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై కేవీకే ఉద్యానవన శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరాజు శనివారం శిక్షణ ఇచ్చారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా రిసోర్స్ సెంటర్ ఆఫీసర్ ఆర్.శ్రీనివాస్.. పెసర, మినుముల విత్తనాల శుద్ధి, వాటిని నాటిన తర్వాత తెగుళ్ల బారినపడకుండా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ధాన్యం కొనుగోళ్లపై కురుపాం ఏడీఏ నిర్మల జ్యోతి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు జ్యోత్స్న, నాగేశ్వరరావు, శాస్త్రవేత్తలు వై.ఉమాజ్యోతి, అనంత విహారి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసరాజు

పాఠశాలల పనివేళలు మార్చవద్దు

గుమ్మలక్ష్మీపురం: పాఠశాలల పనివేళలు మార్చవద్దని ఏపీటీఎఫ్(ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బాలకృష్ణారావు, ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పాలక దేవానంద్‌లు ఓ ప్రకటనలో శనివారం కోరారు. రాష్ట్రంలోని పాఠశాలల ప్రస్తుత పనివేళలను మార్పు చేసే ప్రయోగానికి విద్యాశాఖ శ్రీకారం చుట్టిందన్నారు. పైలట్ ప్రాజెక్టుగా ప్రతీ మండలంలోని ఒక పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని, ఇది పూర్తిగా అశాస్త్రీయమైనదని విమర్శించారు. పాఠశాలల పనివేళలు పెంచితే విద్యార్థులపై శారీరక, మానసిక ఒత్తిడి పెరిగిపోతుందన్నారు. దేశంలో అత్యున్నత విద్యా ప్రమాణాలు, అక్షరాస్యత ఉన్న కేరళ రాష్ట్రంలో కూడా పాఠశాలల పనివేళల సమయం కేవలం 6 గంటలు మాత్రమేనని గుర్తుచేశారు. పని వేళల్లో మార్పు వల్ల ఉపాధ్యాయులపై కూడా పనిభారం పెరిగి, విద్యాబోధనలో నాణ్యత తగ్గే అవకాశం ఉందని, తద్వారా విద్యార్థి నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా పాఠశాలల పనివేళల మార్పు ఆలోచన మానుకోకపోతే పెద్దఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

కరపత్రాల ఆవిష్కరణ

గుమ్మలక్ష్మీపురం: కార్మికులు, రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ఈ నెల 26వ తేదీన చేయనున్న ర్యాలీకి సంబంధించి రూపొందించిన కరపత్రాలను మండల కేంద్రంలో శనివారం ఆవిష్కరించారు. దేశానికి వెన్నెముకలైన రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని రైతు, కార్మిక సంఘాల జిల్లా నాయకుడు గరుగుబిల్లి సూరయ్య తెలిపారు. కార్పొరేట్ శక్తులకు మోదీ సర్కారు కొమ్ముకాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తోందని విమర్శించారు. కనీసం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కూడా ఇవ్వడం లేదన్నారు. రైతులు, కార్మికుల సంక్షేమం, అభివృద్ధే ప్రధానంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

ప్రియాంక గెలుపు కాంగ్రెస్ విజయానికి సంకేతం

గుమ్మలక్ష్మీపురం: వయనాడ్ లోక్‌సభ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంక వాద్రా గెలుపు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి సంకేతమని ఆ పార్టీ కురుపాం కో-ఆర్డినేటర్ అద్దాకుల చిన్నారావు ఓ ప్రకటనలో శనివారం స్పందించారు. ప్రత్యక్ష ఎన్నికల బరిలో నిలిచిన తొలిసారి 4.08 లక్షల ఓట్ల మెజార్టీతో ఆమె విజయం సాధించడం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపిందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి అంతా శుభమేనని జోష్యం చెప్పారు.

అడవుల సంరక్షణకు పటిష్ట చర్యలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): అడవుల సంరక్షణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసూన తెలిపారు. కురుపాం మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయాన్ని శనివారం సందర్శించిన ఆమె.. వివిధ పథకాలు, కార్యక్రమాల ద్వారా అడవుల అభివృద్ధి, సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అనంతరం సంపన్నగూడ, ఇచ్చాపురంలోని బేస్ క్యాంపుల పరిధిలో ఉన్న గుగ్గిలం, టేకు చెట్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. చెట్లను సంరక్షించాలని కోరారు. ఆమె వెంట రేంజ్ అధికారులు మణికంఠేష్, గంగరాజు తదితరులు ఉన్నారు.

నేడు బైక్ ర్యాలీ

పాలకొండ రూరల్: కోవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని ఏపీ రైతు కూలీ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు కేంద్రం తీరును నిరసిస్తూ నేడు పాలకొండ మండలం కొండాపురం నుంచి బైక్ ర్యాలీ చేపట్టనున్నట్లు ఆ సంఘ నాయకులు బి.అప్పలనాయుడు శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. 26వ తేదీ వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ర్యాలీలో పాల్గొని అన్నదాతకు అండగా నిలవాలని కోరారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

వీరఘట్టం: వీరఘట్టం మేజరు పంచాయతీలోని ప్రధాన రహదారిలో వ్యాపారాలు చేస్తున్న వారంతా తమ షాపు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ జీ కళాధర్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద శనివారం వ్యాపారులతో సమావేశం నిర్వహించి సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే అనుమానిత వ్యక్తులను, దొంగలను సులువుగా గుర్తించి వ్యాపారాలు సజావుగా చేసుకునేందుకు వీలుంటుందని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపారులందరూ సమ్మతించారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

సీతంపేట: లబ్ధిదారులకు ఈనెల 30వ తేదీలోగా ఆధార్ నంబర్‌ను బ్యాంకు ఖాతాకు లింక్ చేయించాలని గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి బి.రామ్‌గోపాల్ అన్నారు. శనివారం ఐటీడీఏలోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు తప్పనిసరిగా ఎన్‌పీసీఐ లింక్ కోసం ప్రజలకు చైతన్యం చేయాలన్నారు. రూ.200లకే పోస్టల్ అకౌంట్ తెరిచే అవకాశం ఉందన్నారు. హౌస్‌హోల్డ్ సర్వే, స్కూళ్ల ఇన్‌స్పెక్షన్ పురోగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.గీతాంజిలి, పరిపాలనాధికారి మాస, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: సచివాలయ సిబ్బంది అర్హతగల ప్రతి లబ్ధిదారుకు ప్రభుత్వ సంక్షేమం అందించేలా సహకరించాలని రాష్ట్ర సచివాలయశాఖ ప్రత్యేకాధికారి పి.రాంగోపాల్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సచివాలయ సిబ్బందితో ఎన్‌టీపీసీ, ఆధార్ బ్యాంక్ లింకేజీపై సమీక్ష చేపట్టారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు సంక్షేమ లబ్ది అర్హుల బ్యాంక్ ఖాతాలకు జమ కావాలంటే కచ్చితంగా ఆధార్, ఫోన్ నంబర్ బ్యాంక్ బుక్‌కు అనుసంధానం చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.

జీవరాశులను సంరక్షించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డీపీఎం షణ్ముఖరాజు

గరుగుబిల్లి: జీవవైవిధ్యం కాపాడుకునేందుకు జీవరాశులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా డీపీఎం పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్టు కార్యాలయంలో గరుగుబిల్లి, జియ్యమ్మవలస, బలిజిపేట మండలాలకు చెందిన 60 మంది రైతులకు పంటల సాగుపై శనివారం శిక్షణ ఇచ్చారు. జీవవైవిధ్యంపైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందని, అందుకు ప్రతీ జీవరాశి బతికి ఉండాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించాలని, రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలన్నారు. పొలాల్లో నిత్యం పంటలు పండించుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. రబీ సీజన్‌లో పెసలు, ఉలవలు, వేరుశనగ, కొమ్ముశనగ తదితర పంటలను సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఏలు వై.తిరుపతి, ముసలయ్య, అన్నపూర్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తే చర్యలు



కొమరాడ: సూచనలిస్తున్న ఎస్‌ఐ నీలకంఠం



గరుగుబిల్లి: అవగాహన కల్పిస్తున్న సీఐ పద్మావతి

గరుగుబిల్లి: సారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి హెచ్చరించారు. మండలంలోని సన్యాసిరాజుపేటలోని గ్రామస్తులకు సారా, మద్యం సేవించడం ద్వారా కలిగే దుష్ప్రభావాలపై శనివారం అవగాహన కల్పించారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామం వద్ద సారా, అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు రూట్‌వాచ్ చేయడం జరుగుతోందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రైవేటు మద్యం షాపుల్లో ఎక్కడైనా ఎంఆర్‌పీ కన్నా ఎక్కువ ధరకు మద్యం విక్రయిస్తే ఫోన్ నంబర్ 9440902373కు ఫోన్ చేసి, ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీవలస సర్పంచ్ బి.వెంకటనాయుడు పాల్గొన్నారు.

కొమరాడ: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై శనివారం అవగాహన కల్పించారు. ఎస్‌ఐ కె.నీలకంఠం మాట్లాడుతూ యువత, విద్యార్థులు ఎక్కువగా ఫ్యాషన్ మాయలో పడి మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శివప్రసాద్

గుమ్మలక్ష్మీపురం: సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎల్విన్‌పేట ఎస్‌ఐ బి.శివప్రసాద్ సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలు-వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. లక్కీడ్రా, ఆన్‌లైన్ గేమ్స్, ఆఫర్ల పేరిట సైబర్ నేరగాళ్లు మన బ్యాంకు ఖాతా వివరాలు అడుగుతారని, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే వారు అడిగే ప్రశ్నలకు స్పందించవద్దన్నారు. అలాగే యువత, విద్యార్థులు ఫ్యాషన్ మాయలో పడి మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తులుగా జీవించాలన్నారు. ప్రిన్సిపాల్ టి.శ్రీవరం మాట్లాడుతూ సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, మొబైల్ ఫోన్లను అదే పనిగా వాడొద్దని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీవాణి, స్వరూప, అశోక్‌కుమార్, హరికృష్ణ, తులసి, శ్రీకాంత్, చిన్నారావు, సత్యరావు, శాంత తదితరులు పాల్గొన్నారు.